క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

భువనగిరి : పట్టణంలోని పలు ప్రాంతాలలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ పట్టణ ఏఈ సాయికృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పట్టణంలోని , బీఎస్ఎన్ఎల్ కార్యాలయం, చర్చి, గాంధీపార్కు, బీఎస్ఎన్ఎల్ కార్యాలయం, పాత బస్టాండ్, ఆర్బీనగర్, వీరభద్ర షాపింగ్ మాల్,హన్మాన్‌వాడ, సంజీవనగర్, రోడ్డు ఇరుపక్కల ఉన్న వాణిజ్య సముదాయాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

బాల్య వివాహాల నియంత్రణకు కృషిచేయాలి


మాట్లాడుతున్న బండారు జయశ్రీ

భువనగిరి : బాల్య వివాహాల నియంత్రణకు కృషిచేయాలని జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ బండారు జయశ్రీ అన్నారు. బుధవారం పట్టణంలోని ఓ పాఠశాలలో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా స్పందన కల్చరల్ ఆర్గనైజేషన్ ఫర్ ప్రోగ్రెసివ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ సురేష్ కుమార్, ఎస్ఐ అర్జున్ కుమార్, జి శంకర్, హరిజయరామ్, ప్రధానోపాధ్యాయులు భాస్కర్, లావణ్య, పద్మ, ఉప్పలయ్య, నర్సయ్య, స్వప్న, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది


మాట్లాడుతున్న కందుకూరి సోమన్న

యాదగిరిగుట్ట: ఎస్సీ వర్గీకరణపై తెలంగాణ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని మహాజన సోషలిస్టు పార్టీ (ఎంఎస్‌పీ) ఉమ్మడి నల్లగొండ జిల్లా కో ఆర్డినేటర్ కందుకూరి సోమన్న మాదిగ, ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ బోడ సునిల్ మాదిగ అన్నారు. యాదగిరిగుట్ట పట్టణంలో బుధవారం ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సాధన కోసం డిసెంబర్ 21న హైదరాబాద్‌లో నిర్వహించనున్న మాదిగల ధర్మ యుద్ధ మహా సభను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు నల్ల చంద్రస్వామి, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు దుబ్బ రామకృష్ణ, జాతీయ పోలిట్ బ్యూరో సభ్యుడు మంద శంకర్, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు కొల్లూరి హరీష్, సుంచు ప్రేమ్, ఆకారపు లక్ష్మీనారాయణ, వద్దిగల్ల రాజు, బొల్లారం నాగరాజు, బుగ్గ కనకరాజు, రమేష్ పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

భువనగిరి : ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని మున్సిపల్ వైస్ చైర్మన్, భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గ యాత్ర ప్రముఖ్ మాయ దశరథ అన్నారు. బుధవారం బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలియజేసేందుకు డిసెంబర్ 1 నుంచి 3వ తేదీ వరకు మండల కేంద్రాల్లో బైకు ర్యాలీలు, 4న సభలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చందా మహేందర్ గుప్తా, జిల్లా యాత్ర సహ ప్రముక్ ఎలే చంద్రశేఖర్, జంగారెడ్డి, పడమటి జగన్మోహన్‌రెడ్డి, నర్ల నర్సింగ్‌రావు,పట్నం శ్రీను, శ్యాంసుందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రజక వృత్తిదారుల సంఘం జిల్లా కమిటీ ఎన్నిక

భువనగిరిటౌన్ : తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం జిల్లా నూతన కమిటీని బుధవారం ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా భాతరాజు దశరథ, ప్రధాన కార్యదర్శిగా వడ్డెబోయిన వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షులుగా వడ్డెమాను బాలరాజు, అవనిగంటి స్వామి ,రాచకొండ రమేష్, సహాయ కార్యదర్శులుగా వడ్డెమాను రవి, బొడ్డుపల్లి సతీష్, గుండాల భాస్కర్, కోశాధికారిగా ముదిగొండ కృష్ణ, సలహాదారులుగా బొడ్డుపల్లి మైసయ్య, ఎలిమినేటి నగేష్ ,భాతరాజు యాదయ్య, జిల్లా కమిటీ సభ్యులుగా పొన్న ఉప్పలయ్య, మెతుకు అంజయ్య, ఎలిమినేట్ మురళీకృష్ణ, రాములు, వడ్లకొండ రమేష్‌లను ఎన్నుకున్నారు.

యూటీఎఫ్ మండల కమిటీ..

గుండాల : మండల కేంద్రంలో టీఎస్ యూటీఎఫ్ మండల నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మాసుపాటి యాదయ్య, ప్రధాన కార్యదర్శిగా పులకరం వెంకటేష్, కోశాధికారిగా బత్తుల లింగయ్య, ఉపాధ్యక్షులుగా వెంకట్‌రామ్‌రెడ్డి, పి.వీరయ్య, సోషల్ మీడియా కన్వీనర్‌గా సాయిశశాంక్, మహిళా కన్వీనర్‌గా బి.లావణ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా ఉపాధ్యక్షుడిగా అక్కెనపల్లి వెంకటాచారిని నియమించారు. కార్యక్రమంలో గుండా మల్లేషం, ఎం.లింగమల్లు, వెంకటేశ్వర్లు, వెంకన్న పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు

- మోత్కూరు మినీ ట్యాంక్‌బండ్‌పై అస్తవ్యస్తంగా విద్యుత్ లైన్
- ఒరిగిన, ఫుట్‌పాత్ మధ్యలో ఉన్న స్తంభాలతో పొంచి ఉన్న ప్రమాదం
- పట్టించుకోని అధికారులు
- ఆందోళన చెందుతున్న ప్రజలు


రోడ్డు, ఫుట్‌పాత్‌పై ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలు


మినీ ట్యాంక్‌బండ్‌పై ఒరిగిన విద్యుత్ స్తంభం

మోత్కూరు : పట్టణంలోని మినీ ట్యాంక్‌బండ్(పెద్ద చెరువు)పై ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయి. రోడ్డు పక్కన, ఫుట్‌పాత్ మధ్యలో స్తంభాలు ఏర్పాటు చేయడంతో వాహనదారులు, పాదాచారులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు మినీ ట్యాంక్‌బండ్‌పై పలు చోట్ల విద్యుత్ స్తంభాలు ఒరిగి ఉండడంతో ఎప్పు డు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అయినా విద్యుత్ అధికారులు కన్నెత్తి చూడటం లేదని పలువురు వాపోతున్నారు.

ఫుట్‌పాత్ మధ్యలో..

మోత్కూరు పట్టణంలోని పెద్ద చెరువును గత ప్రభుత్వం రూ.4.21కోట్ల వ్యయంతో మినీ ట్యాంక్‌బండ్‌గా అభివృద్ధి చేసింది. ఇందులో భాగంగా కట్ట రోడ్డును 5 నుంచి 12 మీటర్ల వరకు వెడల్పు పెంచి చెరువు కట్టనే ప్రధాన రహదారిగా మార్చారు. కానీ కట్టపై గతంలో ఉన్న సుమారు 20 విద్యుత్ స్తంభాలను మార్చకపోవడంతో విద్యుత్ స్తంభాలు రోడ్డు అంచున, ఫుట్‌పాత్ మధ్యలో ఉన్నాయి. మరికొన్ని కట్ట లోపలి వైపు ఒరిగి ప్రమాదకరంగా మారాయి. దీంతో వాహనదారులతో పాటు పాదాచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కోసారి ద్విచక్ర వాహనదారులు ఫుట్‌పాత్ మీద వెళ్లినప్పుడు మధ్య ఉన్న స్తంభాలతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కట్ట లోపలి వైపు ఉన్న విద్యుత్ స్తంభాలు ఒరిగి తీగలు చేతికి అందే లా వేలాడుతున్నా యని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దీంతో మినీ ట్యాంక్‌బండ్‌పై ప్రయాణించాలంటేనే జంకుతున్నారు. అస్తవ్యస్తంగా ఉన్న విద్యుత్ లైన్ మార్చక పోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెరువు కట్టపై అస్తవ్యస్తంగా ఉన్న విద్యుత్ లైన్ మార్చాలని స్థానిక ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

విద్యుత్ లైన్ మార్చాలి



మినీ ట్యాంక్ బండ్‌పై విద్యుత్ స్తంభాలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. పెద్ద చెరువును ట్యాంక్ బండ్‌గా మార్చే క్రమంలో చెరువు కట్ట రోడ్డును వెడల్పు చేశారు. కానీ కట్టపై ఉన్న విద్యుత్ స్తంభాలను మార్చలేదు. దీంతో ఫుట్‌పాత్ మధ్యలో, రోడ్డు పక్కన విద్యుత్ స్తంభాలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. ట్యాంక్ బండ్ రోడ్డుపై ప్రయాణించే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి విద్యుత్ లైన్‌ను మార్చాలని కోరుతున్నాం.

– తీపిరెడ్డి సోమిరెడ్డి, మోత్కూరు

సమస్య పరిష్కరించాలి



చెరువు కట్ట రహదారిపై ఉన్న విద్యుత్ స్తంభాలు ప్రమాదాలకు నిలియంగా మారాయి. కనీసం విద్యుత్ స్తంభాలు రేడియం స్టిక్కర్స్ కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో వాహనదారులు, పాదాచారులు ఇబ్బందులు పడుతున్నారు. రేడియం లైట్ల వెలుతురులో వాహనదారులు అప్రమత్తంగా ఉండే అవకాశం ఉంటుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మినీ ట్యాంక్ బండ్‌పై అస్తవ్యస్తంగా ఉన్న విద్యుత్ స్తంభాల సమస్యను పరిష్కరించాలని కోరుతున్నాం.

–పోచం సోమయ్య, బీజేపీ పట్టణ అధ్యక్షుడు

రాళ్లు ఉండటంతో ఇబ్బందికరంగా మారింది

పెద్ద చెరువు కట్టకు రాళ్లతో రివిట్‌మెంట్ ఉండడంతో స్తంభాలు మార్చడానికి, సరి చేయడానికి ఇబ్బందికరంగా మారింది. అస్తవ్యస్తంగా ఉన్న విద్యుత్ లైన్ మార్చడానికి ప్రత్యమ్నాయ ఆలోచనలు చేస్తున్నాం. త్వరలోనే మినీ ట్యాంక్‌బండ్‌పై అస్తవ్యస్తంగా ఉన్న విద్యుత్ లైన్ మార్చి సమస్యను పరిష్కరిస్తాం.

– ప్రభాకర్‌రెడ్డి, విద్యుత్ ఏఈ

మాలల సింహ గర్జనను జయప్రదం చేయాలి


బీబీనగర్ : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

భువనగిరిటౌన్ : మాలల సింహగర్జనను జయప్రదం చేయాలని మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలిజాల ప్రవీణ్ జయప్రకాష్ అన్నారు. బుధవారం మాలల సింహగర్జనకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 1న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న సింహ గర్జనకు మాలలు తరలిరావాలన్నారు. మాలలు తమల హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా నాయకులు జక్కుల రవి, కురిమీళ్ళ కర్ణాకర్, కురిమిళ్ళ కమలాకర్ ఉప్పుల వంశీ ఉప్పుల శాంతి కుమార్ అరుణ్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

బీబీనగర్: డిసెంబర్ 1న హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న మాలల సింహ గర్జనకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను బుధవారం మండల కేంద్రంలోని మాలల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాలల సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు బెజ్జం శ్రీనివాస్, ఉపాధ్యక్షులు భిక్షపతి, ప్రధాన కార్యదర్శి రాజేంద్రప్రసాద్, నాయకులు సత్తీష్, ప్రభాకర్, నవీన్, శేఖర్ పాల్గొన్నారు.

గుండాల : హైదరాబాద్‌లోని పేరేడ్ గ్రౌండ్‌లో డిసెంబర్ 1న నిర్వహించనున్న మాలల సింహ గర్జన వాల్‌పోస్టర్‌ను బుధవారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కొర్న నరేష్, దార సైదులు, రమేష్, బోడ బాబురావు, నీరటి పురుషోత్తం, దార అనిల్, దార సతీష్, దార స్వామి, చంద్రశేఖర్, మహేందర్, సురేష్, పులి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి


కంపెనీ ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

యాదగిరిగుట్ట రూరల్: యాదాద్రి లైఫ్ సైన్సెస్ ఫార్మా కంపెనీలోడ్రగ్స్ తయారీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉట్కూరు అశోక్ గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం యాదగిరిగుట్ట మండలంలోని రామాజీపేట గ్రామ పరిధిలోని యాదాద్రి లైఫ్ సైన్సెస్ పరిశ్రమ ఎదుట బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పాలకుల ప్రమేయం లేనిదే డ్రగ్స్ తయారీ సాధ్యం కాదన్నారు. డ్రగ్స్ తయారీ వెనుక ఎవరున్నారో తేల్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కర్రె ప్రవీణ్, స్టేట్ కౌన్సిల్ మెంబర్ రచ్చ శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి కాదూరి అచ్చయ్య, మండల అధ్యక్షులు గుంటిపల్లి సత్యం, కార్యదర్శి ఆకుల చంద్రమౌళి, మదోజి నరేష్, బూడిద నవీన్, రాజిరెడ్డి, సురేష్, శ్రీశైలం, అజయ్, సాయి, వంశీ, మల్లయ్య, కృష్ణ పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తప్పులు లేకుండా డేటా ఎంట్రీ పూర్తి చేయాలి


భూదాన్‌పోచంపల్లి : ఎంపీడీఓ కార్యాలయంలో కొనసాగుతున్న డేటాఎంట్రీని పరిశీలిస్తున్న ఆర్డీఓ

భూదాన్‌పోచంపల్లి : కుటుంబ సమగ్ర సర్వే డేటాను తప్పులు లేకుండా ఎంట్రీ పూర్తి చేయాలని చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో చేపట్టిన సర్వే డేటా ఎంట్రీని పరిశీలించారు. సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ నిర్ణీత గడువులోగ డేటా ఎంట్రీని పూర్తి చేయాలని అన్నారు. అనంతరం తహసీల్దార్ మహేందర్‌రెడ్డితో కలిసి పట్టణ కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు వండిపెట్టిన భోజనాన్ని పరిశీలించారు. మెనూ పాటిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకొన్నారు. నాణ్యత లేని పురుగుపట్టిన, మెరిగలు ఉన్న బియ్యం వస్తున్నాయని, అన్నం కూడా మెత్తగా అవుతుందని మధ్యాహ్న భోజన నిర్వాహకులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ నాగేశ్వర్‌రావు, ఎంఆర్ఐ గుత్తా వెంకట్‌రెడ్డి, ఏఎస్ఓ శైలజ, అపర్ణ, హెచ్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ సర్వే 98శాతం పూర్తి

భువనగిరిరూరల్ : మండలంలో 98 శాతం సర్వే పూర్తయిందని ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. బుధవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. సర్వేలో కుటుంబాల వివరాలు నమోదు చేసుకోని వారు 9849903270 నంబర్‌ను సంప్రదించి వివరాలు నమోదు చేసుకోవాలన్నారు.

సర్వేలో వివరాలు నమోదు చేసుకోవాలి

చౌటుప్పల్ రూరల్ : సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో వివరాలు నమోదు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కోమటిరెడ్డి నర్సింహ రెడ్డి, ఎంపీడీఓ సందీప్ అన్నారు. బుధవారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడారు. మునిసిపల్ పరిధిలోని ప్రజలు నంబర్ 9848391286 కు, మండలంలోని గ్రామాల చెందిన ప్రజలు 9281489557నంబర్లను సంప్రదించి వివరాలు నమోదు చేసుకోవాలన్నారు.

మోత్కూరు: సర్వేలో తప్పకుండా కుటుంబ వివరాలు నమోదు చేయించుకోవాలని మోత్కూరు ఎంపీడీఓ బాలాజీ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. సర్వే ఎన్యూమరేటర్లకు గ్రామాల్లో అందుబాటులో లేని కుటుంబ యజమానులు, వారి సమీప బంధువులు, ఇరుగు, పొరుగు వారికి సమాచారం అందించి సర్వేలో నమోదయ్యేటట్లు చూసుకోవాలని కోరారు.

పాఠశాలలు, వసతి గృహాల్లో ఆకస్మిక తనిఖీలు


యాదగిరిగుట్ట బాలుర హాస్టల్‌లో విద్యార్థులతో కలిసి నిద్రపోతున్న ఎంపీడీఓ నవీన్‌కుమార్


భూదాన్‌పోచంపల్లి : విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న తహసీల్దార్ మహేందర్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి : పట్టణ కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహాన్ని బుధవారం రాత్రి తహసిల్దార్ ఎం. మహేందర్‌రెడ్డి తనిఖీ చేశారు. తాగడానికి గ్లాసులు లేవని విద్యార్థులు చెప్పడంతో వెంటనే గ్లాసులను కొనుగోలు చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. విద్యార్థులతో కలిసి అక్కడే నిద్రించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ఐ గుత్తా వెంకట్ రెడ్డి, వార్డెన్ కరుణశ్రీ తదితరులు ఉన్నారు.

యాదగిరిగుట్ట: పట్టణంలోని పాత గుండ్లపల్లిలో ఉన్న వెనుకబడిన తరగతుల బాలుర వసతి గృహంలో యాదగిరిగుట్ట ఎంపీడీఓ నవీన్ కుమార్ బుధవారం రాత్రి నిద్ర చేశారు. అంతకు ముందు హాస్టల్‌ను పరిశీలించి, విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

మోత్కూరు : మున్సిపల్ కేంద్రంలోని సుందరయ్య కాలనీలోని బీసీ బాలికల వసతి గృహాన్ని బుధవారం రాత్రి మున్సిపల్ కమిషనర్ సి.శ్రీకాంత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు. వారి వెంట ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి, బీసీ వెల్ఫేర్ సంక్షేమ అధికారి జ్యోతి ఉన్నారు.

రామన్నపేట : మండలంలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతిగృహాన్ని బుధవారం రాత్రి ఎంపీడీఓ బి.యాకుబ్‌నాయక్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేసి అక్కడే నిద్రించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు హేమలత, బాలమణి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం): మండలంలోని మొరిపిరాల ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ కొత్త మహదేవరెడ్డి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని రికార్డులను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. ఆయన వెంట సీఆర్‌పీ సత్తయ్య ఉన్నారు.

వలిగొండ : మండలంలోని లోతుకుంటలోని ఆదర్శ పాఠశాల బాలికల హాస్టల్‌ను బుధవారం రాత్రి తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. హాస్టల్స్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసమే హాస్టల్ నిద్ర చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఆలేరురూరల్ : పట్టణ కేంద్రంలోని ఎస్టీ హాస్టల్‌ని బుధవారం ఆలేరు తహసీల్దార్ ఆంజిరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా హాస్టల్ రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ పూర్ణచందర్ రావు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మోటకొండూర్: మండలంలోని మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాలలో ఎంపీడీఓ ఇందిర, ఎస్సీ బాలుర వసతి గృహంలో మండల ప్రత్యేక అధికారి, డీసీఓ శ్రీధర్ బుధవారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేసి అక్కడే నిద్రించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జ్యోతి, వార్డెన్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డగూడూరు : మండలంలోని మంగమ్మగూడెంలోని సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాలను బుధవారం ఎంపీడీఓ శంకరయ్య తనిఖీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమా, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


మోటకొండూర్: ఎస్సీ హాస్టల్ విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీసీఓ శ్రీధర్


మోత్కూరు : బాలికల వసతి గృహం తనిఖీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్


వలిగొండ : ఆదర్శ పాఠశాల విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్

చర్య తీసుకోవాలని వినతి

భువనగిరిటౌన్ : బాలల పరిరక్షణ విభాగంలో పనిచేస్తున్న బోగస్ సర్టిఫికెట్స్‌తో పని చేస్తున్న ఉద్యోగులపై చర్య తీసుకోవాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వస్తాపుల అభిలాష్, ఉప్పుల శాంతి కుమార్‌లు బుధవారం కలెక్టర్ కార్యాలయ ఏఓ జగన్‌మోహన్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు దాసరి లక్ష్మయ్య, ఎఐవైఫ్ నాయకులు చందు,లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

టీకాలు వేయించాలి

భువనగిరి రూరల్ : పిల్లలకు తప్పక టీకాలు వేయించాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి అధికారి రామకృష్ణ , బొల్లపల్లి వైద్యాధికారి డా.యమిని శతి అన్నారు. బొల్లెపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని చందుపట్ల, వీరవల్లి గ్రామాల్లో బుధవారం నిర్వహించే న్యూట్రిషన్ డేను పరిశీలించారు. అనంతరం వీరవల్లి పల్లె దవఖాన నూతన భవన నిర్మాణ పనులను సమీక్షించారు. కార్యక్రమంలో తులసి, దివ్య, సత్యనారాయణ, సునీత, శోభ, పుష్ప మంగమ్మ సంధ్య పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలి

మోత్కూరు : విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు జి.లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. బుధవారం మోత్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి చెకుముఖి ప్రతిభా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు సూ రోజు భాస్కరాచారి, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా నాయకులు సుబ్రహ్మణ్యంశర్మ, సైన్స్ ఉపాధ్యాయులు వెంకటాచారి, ఆనంద్‌కుమార్, నర్సింహులు, సరోజ, మధుకర్, చాంద్‌పాషా, మహేష్ పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి


విద్యార్థులతో మాజీ సర్పంచ్ బండి కృష్ణగౌడ్

భూదాన్‌పోచంపల్లి : విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉత్తమ ఫలితాలను సాధించాలని మాజీ సర్పంచ్ బండి కృష్ణ గౌడ్ అన్నారు. మండలంలోని ఇంద్రియాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బండి దయాకర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పదో తరగతి చదువుతున్న 19 మంది విద్యార్థుల వార్షిక ఫీజు మొత్తాన్ని బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గురునాథంకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వందన, హన్మంతరెడ్డి, శైలజ, విద్యార్థి నాయకులు ఎర్ర విక్రమ్, బీమగాని శ్రీకాంత్, రెవెల్లి అశోక్, బుచ్చిబాబు, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆలయ బ్రహ్మోత్సవాలు

వలిగొండ : మండలంలోని సుంకిశాల గ్రామంలోని శ్రీ పద్మావతి అలివేలు మంగ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. బుధవారం ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం స్వామి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించన్నునట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన

చౌటుప్పల్ రూరల్: ప్రజా పాలన – ప్రజా విజయోత్సవాల్లో భాగంగా బుధవారం మండలంలోని దేవలమ్మ నాగారం,ఎల్లబాయి, కొయ్యలగూడెం గ్రామాల్లో ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శంకర్,పాశం రాములు,బోనాల నరేందర్, సురేష్, గుండెల లింగస్వామి, యాట సంధ్య పాల్గొన్నారు

పోటు ప్రసాద్‌కు నివాళి

భువనగిరిటౌన్ : సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు, ఏశాల అశోక్, పుట్ట రమేష్, బాబా చందు, ఉమర్ పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ

ఆత్మకూరు(ఎం):మండలంలోని రాఘవాపురంలో రాఘవాభారతి గ్రంథాలయం వార్షికోత్సవ కరపత్రాన్ని బుధవారం ఎంఈఓ కొత్త మహదేవరెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ అధ్యక్షుడు వల్లాల రమేష్, నరేష్, వెంకన్న, గోపయ్యచారి, సిద్దిక్, తిరుమలేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ఆత్మకూరు(ఎం): ప్రజా పాలన విజయోత్సవాల సందర్భంగా మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు ప్రతిభను కనబరిచిన వారిని జిల్లా స్థాయికి ఎంపిక చేయనున్నట్లు ఎంఈఓ కొత్త మహదేవరెడ్డి తెలిపారు.

దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలి

మోత్కూరు : ఈ నెల 29న బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించనున్న దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలని మోత్కూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కె.యాకూబ్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో కోరారు.

సంక్షిప్త సమాచారం

మహాసభలను జయప్రదం చేయాలి

యాదగిరిగుట్ట: డిసెంబర్ 15, 16, 17తేదీల్లో చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో నిర్వహించనున్న సీపీఎం మూడవ జిల్లా మహాసభను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మంగ నర్సింహులు పిలుపునిచ్చారు. బుధవారం యాదగిరిగుట్ట పట్టణంలో, పెద్దకందుకూరు గ్రామాల్లో సభకు సంబంధించిన వాల్ రైటింగ్‌లను రాయించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి బబ్బూరి పోశెట్టి, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేష్, పెద్దకందుకూరు మాజీ సర్పంచ్ భీమగాని రాములు గౌడ్, కాలే స్వామి పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాల పేరు మార్పు

రాజాపేట : మండలంలోని రఘునాథపురం ఉన్నత పాఠశాల పేరును సంగిశెట్టి నర్సయ్య మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా మార్పు చేసినట్లు మండల విద్యాధికారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలకు సంబంధించిన స్టాంపులతోపాటు బోర్డుల్లో మార్పులు చేస్తున్నట్లు తెలిపారు.

దుప్పట్లు పంపిణీ

యాదగిరిగుట్ట: పట్టణంలోని పాత గుండ్లపల్లిలో గల వెనుకబడిన తరగతుల బాలుర వసతి గృహం విద్యార్థులకు ఆర్డీఓ కృష్ణారెడ్డి సమకూర్చిన దుప్పట్లను బుధవారం తహసీల్దార్ దేశ్యా, పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నర్సింహరావు, ఆర్ఐ శ్రీకాంత్, ఇన్‌చార్జ్ హాస్టల్ వార్డెన్ తదితరులు పాల్గొన్నారు.

గోగు వెంకటేశ్వర్లకు పరామర్శ

రామన్నపేట : అఖిలభారత యాదవ మహాసభ విద్యావంతుల వేదిక మండల అధ్యక్షుడు గోగు వెంకటేశ్వర్లు మాతృమూర్తి ఎల్లమ్మ బుధవారం మృతిచెందింది. ఎల్లమ్మ మృతదేహాన్ని ఫిష్ అండ్ గోట్ డెవలప్‌మెంట్ మాజీ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు యాదవ్ సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట యాదవ మహాసభ జిల్లా గౌరవాధ్యక్షుడు ముక్కాముల దుర్గయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గుండెబోయిన అయోధ్యయాదవ్, బీఆర్ఎస్‌పార్టీ మండల ప్రధానకార్యదర్శి పోచబోయిన మల్లేశం కన్నెబోయిన బలరాం, రేపాక లింగస్వామి, వినయ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యులపై చర్య తీసుకోవాలి

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని పిలాయిపల్లి గ్రామంలో కుతాడి ప్రేమలత, యాదగిరి ఇంటిని ధ్వంసం చేసిన వారిపై వెంటనే చర్య తీసుకోవాలని కోరుతూ బుధవారం తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం, ఎరుకల ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లో ఎస్సీ, ఎస్టీ కమీషన్ చైర్మన్ వెంకటయ్యను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కూతాడి రవికుమార్, శ్రీరామ్ సదానందం, యాదగిరి, సురేశ్ తదితరులు ఉన్నారు.

పోలీస్ స్టేషన్ సందర్శించిన విద్యార్థులు

భువనగిరి రూరల్ : పట్టణంలోని జీనియస్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు బుధవారం రూరల్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సంతోష్ కుమార్ పోలీస్ స్టేషన్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ అక్షలత, ఏఓ రవి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జనగాం బస్ డిపో మేనేజర్‌కు వినతి

ఆలేరురూరల్ : బుధవారం జనగాం డిపోకు చెందిన అన్ని రకాల బస్సులు ఆలేరు ఆర్టీసీ బస్టాండ్‌లో నిలపాలని కోరుతూ ఆలేరు అఖిపక్షం కన్వీనర్ పసునూరి వీరేశం ఆధ్వర్యంలో బుధవారం జనగాం డిపో మేనజర్ ఎస్.స్వాతికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సలీం, అశోక్, బాంబే రవి, సుభాష్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

రామన్నపేట : అనారోగ్యంతో బాధపడుతున్న మండలంలోని జనంపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త మేడబోయిన రమేష్‌యాదవ్‌ను బుధవారం టీపీసీసీ మాజీ కార్యదర్శి దైద రవీందర్ పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయనవెంట చలమల్ల లింగారెడ్డి, సైదులు సుదర్శన్, గోపాల్, వెంకన్న పాల్గొన్నారు.

దివీస్ సేవలు అభినందనీయం

వలిగొండ : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దివీస్ పరిశ్రమ అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎంఈఓ భాస్కర్ అన్నారు. బుధవారం దివీస్ పరిశ్రమ ఆధ్వర్యంలో మండలంలోని 12 జిల్లా పరిషత్ ఉన్నత , కస్తూరిబా, ఆదర్శ పాఠశాలలకు సైన్స్ ల్యాబ్ పరికరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, దివీస్ ప్రతినిధులు సాయి కృష్ణ, వంశీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు పోడియం బహూకరణ


పోడియం అందజేస్తున్న జహంగీర్

వలిగొండ : మండలంలోని టేకులసోమారం గ్రామానికి చెందిన ఎండీ మహాబూబ్ అలీ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు జహంగీర్ బుధవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.20వేలు విలువ చేసే పోడియాన్ని బహూకరించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కనుకదుర్గ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెక్కు అందజేత

మోత్కూరు : మండలంలోని పనకబండ గ్రామానికి చెందిన బత్తిని మురళికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సహకారంతో సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.20 వేల చెక్కును బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కడియం రామచంద్రయ్య అందజేశారు. ఆయన వెంట రాదారపు మల్లేషం, నాయకులు నల్లబోగుల వెంకటేష్, బత్తిని సతీష్, నిలిగొండ మహేష్, సతీష్ పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.